కథా నిలయం
శ్రీకాకుళం

# నాన్నా...నువ్వో సున్నానా?

"మిస్టర్ కృష్ణమూర్తి...నువ్వు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం మంచిదయ్యా... ఇక నువ్వు పనికిరావు. ఇక్కడ పనిచేయడానికి"

"రిటైర్మెంట్ తీసుకుని ఏం చేయమంటారు సార్. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయాలి. ఆఖరుగాపుట్టి అల్లారుముద్దుగా పెరిగిన కొడుకు చదువే ఇంకా పూర్తికాలేదు.

ఇంటికి పంపిస్తూ మీరు ఇచ్చే ఆరు లక్షలూ బ్యాంకులో దాచుకుంటే నెలకు మూడువేల రూపాయలకు మించిరాదు. ప్రస్తుతం వచ్చే తొమ్మిదిన్నరవేలే బొటాబొటిగా సరిపోతున్నయ్" తనగోడు వెళ్లబోసుకున్నాడు కృష్ణమూర్తి.

"నిజమే... నీ బాధలు నువ్ చెప్పుకుంటున్నావ్. బాగానే వుంది కాని సర్కారు వారిప్పుడు నీ సమస్యలు వినేందుకు సిద్ధంగా లేరు. నీ స్థానంలో కొత్తగా కంప్యూటర్స్ కోర్సు పూర్తి చేసిన ఏ కుర్రాడిని పెట్టుకున్నా రెండువేల రూపాయలు ఇస్తాం అంటేచాలు ఎగిరి గంతేసి ఉద్యోగంలో చేర్తాడు. నీకంటే మూడురెట్ల పని రాబట్టుకోవచ్చు కూడా. కాబట్టి ఈ వైపుగా ఆలోచిస్తే నీకంత జీతమిస్తూ నష్టాలు తెచ్చుకోవటంకంటే అలాంటి కుర్రాళ్ళని పెట్టుకోవటం లాభంకదూ"

"లాభనష్టాలు చూసుకోవటంతోపాటు మేం ఎలా బ్రతుకుతామో కూడా ఆలోచించాలిగా సార్. పాతిక సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నవాడ్ని ఉన్నట్టుండి పనికిరావు పొమ్మంటే మా కుటుంబం వీధిన పడాల్సొస్తుందిగా సార్" అన్నాడు కృష్ణమూర్తి.

"నీ కబుర్లు విని జాలిపడే పరిస్థితుల్లేవయ్యా. ఆ రోజులు పొయినై. నాకు తోచింది నేను చెప్పేను. అనక నీ ఇష్టం. అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. నువ్వు వి.ఆర్.యస్. తీసుకోవనుకో. మేమే

సి.ఆర్.యస్ ఇచ్చి ఇంటికి పంపాల్సొస్తుంది. అప్పుడు ఆరులక్షలురావు.... కేవలం నీ అప్పులు గట్టాపోనూ అరలక్ష చేతపుచ్చుకుని ఇంటికి వెళ్లాల్సొస్తుంది... ఆలోచించుకో"

* * * *

"ఏమండీ" పిలిచింది కృష్ణమూర్తి భార్య.

"ఏమిటి కమలా" అన్నాడు కృష్ణమూర్తి

"పెద్దమ్మాయి పెళ్లి గురించి మీరేం ఆలోచించటంలేదు. రంగారావు గారి అమ్మాయికి సంబంధం కుదిరిందట. వైశాఖ మాసంలో ముహూర్తంట దానికి పాతిక సంవత్సరాలొస్తున్నయ్. ఏ వయసుకాముచ్చట అన్నారు. దానివెనకాలే రెండోది తయారవుతూ ఉన్నది. ఎంతసేపూ ఆఫీసు పని, ఆఫీసు పని అంటూ ఇరవై నాలుగ్గంటలూ ఆ ధ్యాస తప్ప ఇంటి సంగతులు పట్టించుకోవటమేలేదు"

"కమలా...ఇప్పుడు నన్ను మాట్లాడించకోయ్"

"ఈ విషయం నేనెప్పుడు ప్రస్తావించినా మీరనే మాట ఇదేగా! అయినా ఇటువంటి విషయాల్లో మగవాళ్లు చొరవ తీసుకుని చేయాలిగానీ ఆడవాళ్లం ఎంతగా ఆరాటపడితే మాత్రం ఏం ప్రయోజనం... దాని ఖర్మ ఎలా వుంటే అలా అవుతుంది అని సరిపెట్టుకోలేకపోతున్నాను. తల్లి మనసు మీకేం తెలుస్తుంది" నిష్ఠూరంగా అంది కమల.

"కమలా...ప్లీజ్..నాకు విసుగ్గా వుంది"

"నా విషయం అన్నా, పిల్లల విషయాలన్నా మీకు విసుగే. ఎంతసేపూ మీ ఆఫీసు, మీరు, మా గోల మీకు పట్టదులెండి. లేవండి...అన్నం తిని పడుకుందురుగాని పదండి" అంది.

"నాకు ఆకలిగా లేదు కమలా– నువ్వూ పిల్లలూ తిని పడుకోండి. నన్ను నిద్రపోనీ"

"బాగుంది వరుస. నేరకపోయి అన్నాన్లేగానీ అన్నానికి రండి. మీ ఇష్టం వచ్చినట్లు చేయండి. ఇంకోసారి నేను ఈ ప్రస్తావన తీసుకువస్తే అప్పుడనండి, అలగండి. ఈసారికి క్షమించండి... రండి"

ఇక ఆమెకు ఏం చెప్పినా ప్రయోజనం వుండక పోగా పెద్ద రాద్ధాంతం చేస్తుందని తెలిసిన కృష్ణమూర్తి అన్యమనస్కంగా భోజనానికి బయల్దేరాడు.

"రాంబాబూ... నాకు అర్జంటుగా రెండు వేలు కావాలి. మా వాడ్ని హాస్పిటల్‌లో చేర్పించిందట మా ఆవిడ. ఉన్నపళంగా ఏవేవో టెస్టులు చేయించాలన్నారట డాక్టర్లు. జేబులో వంద రూపాయలుకూడా లేవ్... ఎలాగోలా నీవే సర్దుబాటు చేయాలి.రేపు శాలరీస్ రాగానే ఇచ్చేస్తాను"

'వేలకి వేలంటే నా దగ్గర మాత్రం రెడీగా వుంటయ్యా కృష్ణమూర్తీ. అయినా నువ్వూ కాస్త జాగ్రత్త పడాలి. ఏకాస్త అవసరం వచ్చినా అప్పు చేయటం అంటే ఎట్లా" మందలింపు ధోరణిలో అంటూనే ఎలాగో డబ్బిచ్చాడు రాంబాబు.

"సార్... మావాడు హాస్పిటల్లో ఉన్నాడు. నన్ను అర్జంటుగా రమ్మని మా ఆవిడ ఫోన్‌చేసింది. ఏవో టెస్టులు చేయించాలట. పర్మిషన్ కావాల్సార్"

"బాగుందయ్యా. ఎవరికి వాళ్లు ఏదో ఒకసాకు చెప్పి ఇళ్లకు వెళ్తే నేనేం చేయాలి. హెడ్ ఆఫీస్ వాళ్లు నన్ను తిడుతున్నారు. మీకేం తెల్సు నా ఇబ్బందులు. నువ్వు పర్మిషన్ తీసుకుంటావో, రాత్రంతా ఇంట్లో కూర్చొని తయారుచేస్తావో నీ ఇష్టం. రేపు ఉదయం పదిగంటలకల్లా ఆ స్టేట్‌మెంట్ నా టేబుల్‌మీద వుండాలి అంతే. వెళ్తే వెళ్లు"

"అలాగేసార్. థాంక్యూ- ఫైలు ఇంటికి తీసుకువెళ్తున్నాను. రేపటికి తప్పకుండా తీసుకువస్తాను"

బ్రతుకు జీవుడా అనుకుంటూ ఆఫీసునుంచి బయటపడ్డాడు. ఫైలుతో సహా కృష్ణమూర్తి. ఆదరా బాదరా హాస్పిటల్‌కి చేరుకున్నాడు.

జాలిగా చూస్తున్న కొడుకు చూపులు, ఇప్పుడా వచ్చేది అన్నట్లు నిరసన పలుకుతున్న ఇల్లాలి చూపులు కృష్ణమూర్తిని నిస్సహాయుడ్నిచేసినై.

ఆటోలో లేబోరేటరీలకు వెళ్లి డాక్టర్లు చెప్పిన పరీక్షలన్నీ చేయించి మళ్లీ హాస్పిటల్‌కు చేరుకున్నారు.

"కమలా.. నువ్వెళ్లి పిల్లలకి భోజనం ఏర్పాటు చూడు. నువ్వు కూడా తినేసిరా"

"మీరో?" అని అడిగింది కమల.

"నేను తినివచ్చాన్లే... నాకు తొందర్లేదు" అని భార్యతో అందమయిన అబద్ధం చెప్పి హాస్పిటల్లో కొడుకుదగ్గర వుండిపోయాడు కృష్ణమూర్తి.

సెలైన్ బాటిల్లోంచి ఒక్కో చుక్క శరీరంలోకి ప్రవేశిస్తుండగా, మత్తుగా నిద్రపోతున్న కొడుకుని ఓసారి పరికించి చూశాడు కృష్ణమూర్తి. ప్రేమగా తల నిమిరాడు. కంటితడిని తుడుచుకుని సంబాళించుకున్నాడు. ఎర్రగా,

క్రూరంగా, వికటాట్టహాసం చేస్తూ·కన్పించింది ఆఫీసు ఫైలు, దాంతోపాటే బాస్ మాటలు గుర్తుకు వచ్చినై. లేచి ఫైలు అందుకున్నాడు. గోడనానుకుని కూర్చుని పనిలో నిమగ్నమయ్యాడు. పనిచేస్తూనే ఆలోచనల్లో మునిగిపోయాడు.

పాపం... పెళ్లాం, పిల్లలు, తమ వాళ్లకంటే ఆఫీసునే ఎక్కువగా ప్రేమిస్తాననుకుంటారు. అందుకే వాళ్ళకి ఆఫీసు పనంటే అక్కసు.కాని ఆఫీసనేది లేకపోతే ఇంతమంది కడుపులు ఎలా నిండుతయ్? ఈ మాత్రం సుఖంగా ఎలా బ్రతగ్గలుగుతాం.

ఆఫీసులో వాళ్లకు ఇంటి సమస్యల్తో నిమిత్తం లేదు, వాళ్లు చెప్పిన సమయానికి వాళ్లపని చేసిపెట్టాలి. ఇంట్లోవాళ్లకి ఆఫీసు సమస్యలంటేనే చిరాకు. వాళ్ల కోరికలు తీర్చటానికి, వాళ్లతో సమయం గడపటానికి కూడా తీరికలేని నాన్నలంటే వాళ్లకి చులకన. తమని నిర్లక్ష్యం చేస్తున్నాడన్న అపోహ. వాళ్లంటే ప్రేమలేదని అభియోగం. ప్రతి మగవాడి జీవితంలోనూ తప్పని ఓ విచిత్ర పరిస్థితి.

ఉద్యోగం పురుష లక్షణం అనేది ఒకప్పటిమాట. ఉద్యోగం మనిషి లక్షణం అనేది మొన్నటిపాట. మరిప్పుడో ఉద్యోగాలకు మనుషుల్తో పనిలేదట. అన్నీ యాంత్రికమే మనుషులు రోజులో చేసే పనిని మరలు గంటలో చేయగలుగుతున్నప్పుడు మాకు మనుషుల్తో పనేంటంటున్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వకపోగా ఉద్యోగస్థులకి ఉద్వాసన పలికి ఇంటికి పంపుతున్నారు. నడివయసులో, బాధ్యతలేవీ తీరకముందే, తీరిగ్గా ఇంట్లో కూర్చుని సంసారం ఎలా గడపాలి. అసలు వ్యాపకం లేకుండా పోతే మనుషులు పిచ్చివాళ్లైపోరూ! ఇవన్నీ ఆలోచించాల్సిన బాధ్యత ప్రభువులకి లేదూ? అదేమని అడిగేహక్కు కూడా కాలరాచి మేం చెప్పిందే వేదం, ఇచ్చిందే జీతం అంటున్నారు.

సిన్సియారిటీతో పన్లేదు. సీనియారిటీ వుంటే చాలు పదోన్నతులు. అర్హతల్తో పన్లేదు అదృష్టం వుంటే అందలాలు ఎక్కవచ్చు. ఆ అదృష్టం కులం కావచ్చు, మతం కావచ్చు, మదం కావచ్చు, ధనం కావచ్చు! డబ్బుంటే అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకోవచ్చు, కులమతాల పేరున కుళ్లు రాజకీయాలు జరిపి పబ్బం గడుపుకోవచ్చు. ఎటొచ్చీ అన్నం పెడుతున్నందుకు కృతజ్ఞతగా ఒళ్లువంచి పనిచేసేవాళ్ళకే కష్టాలు, నష్టాలు. అయినా ఫరవాలేదు పనికి వెరసేదేలేదు...కానీ సంసారం?

భార్యాపిల్లలు తనని దోషిలా చూస్తున్నారే. ఇంట్లో వాళ్లపట్ల బాధ్యతా రాహిత్యం కనబరుస్తున్నానని అపోహపడుతున్నారే. అమ్మ చూపించే ప్రేమలో నూరోవంతు కూడా నాన్న దగ్గర్నుంచి పొందలేక పోతున్నామని మధనపడిపోతున్నారే?

వాళ్లకెలా ఈ నాన్న పరిస్థితి తెలిసేది? నేనూ వాళ్లని అత్యంత ప్రేమిస్తున్నానని ఎట్లా చెప్పటం?

ఆలోచనల్లతోనే ఆఫీసు పని చేసుకుంటున్న కృష్ణమూర్తి శ్రీమతి రాకతో ఇహలోకంలో పడ్డాడు. తనకోసం క్యారేజి తెచ్చింది.

"నేను తిన్నానని చెప్పానుగా కమలా"

"మీరు తిన్నారో, తిన్లేదో నాకా మాత్రం తెలీదేంటీ? ... ఇలా అన్నం తినకుండా, పగలూ, రాత్రి ఆఫీసు ఫైళ్లతో సతమతమైపోతుంటే మీ ఆరోగ్యం ఏమైపోనూ? అయినా ఆఫీసులో మీకు ఒక్కరికేనా ఇంత పని, అందరికీ ఇంతేనా " అడిగింది కమల.

"అదంతా ఓ పెద్దకథలే కమలా... చెప్పినా నీకు అర్థంకాదు. అర్థం అయినా నువ్ చేయగలిగిందేమీ వుండదు. ఇంటి సమస్యల్తోపాటు నీకు ఇవన్నీ కూడా ఎందుకులే... సరే నే కాసేపు పడుకుంటాను. నువ్వో రెండు, మూడు గంటలు కూర్చో... అప్పుడు మళ్ళీ నన్ను నిద్రలేపు. నాకెటూ ఫైళ్ళ పనివుంది. చేసుకోవాలి. నువ్వు నిద్రపోదువుగాని" అంటూ చాపమీద నడుం వాల్చాడు కృష్ణమూర్తి. కొడుకు మంచం దగ్గరికి స్టూలు లాక్కుని కూర్చుంది కమల.

వచ్చే జీతం కుటుంబ సభ్యులందరి కడుపులు నిండటానికి, కరెంటు ఛార్జీలకు, ఇంటి అద్దెకు సరిపోతుంది. అంతకుమించి ఏ ఖర్చూ భరించలేని స్థితి కృష్ణమూర్తిది. డాక్టర్ల దగ్గరకు వెళ్ళాల్సొచ్చిందంటే ఉక్కిరిబిక్కిరి కాక తప్పదు. అప్పటికే పి.యఫ్.లోను గట్రా వాడేసుకుని నెలనెలా జీతంలో కోతలకు అలవాటుపడ్డాడు. అవికాక ఎరిగినవారి దగ్గర చేబదుళ్లు. వెంటబడి ఇస్తున్న బ్యాంకుల పర్సనల్ లోన్లు తీసేసుకుని అప్పులన్నీ తీర్చేశాడు.

ఇప్పుడిప్పుడే కాస్త ఊపిరి పీల్చుకుంటుంటే మళ్ళీ అదనపు భారం. తెలిసిన చీటీ వ్యాపారస్థుడ్నీ కలుసుకున్నాడు. ఓ చీటీలో సభ్యుడిగా చేరేడు. వచ్చినవరకు తీసుకున్నాడు. కొడుకుని హాస్పిటలు నుంచి ఇంటికి తీసుకువచ్చాడు.

అనారోగ్యంనుంచి కోలుకున్న కొడుకుని చూసి అప్పులబాధ మర్చిపోయాడు. చీటీ పాడుకున్న డబ్బుల్లో మిగిలినవాటిని పెట్టి ఓ పోర్టబుల్ టీ.వీ. కొన్నాడు. ఆరోజు భార్యా పిల్లల ముఖాల్లో కన్పించిన ఆనందం చూసి సంబరపడిపోయాడు.

కుటుంబ సభ్యులందరి ఆనందంలో తృప్తిని వెతుక్కునే సగటు తండ్రి కృష్ణమూర్తి.

ఇవన్నీ డబ్బుల్లేని నాన్నల కథలు. ఈ కథలన్నీ ఇలానే వుంటయ్. శక్తికి మించిన ఖర్చులు, అప్పుల ఊబిలో ఇరుక్కుపోయి, ఆ కష్టాల్ని కన్నవారికి, కట్టుకున్నవారికి తెలియకుండా జాగ్రత్తపడుతూ నాటకాన్ని నడిపించే పాత్రధారి నాన్న.

అలా ఎందరెందరో నాన్నల్లాంటి కృష్ణమూర్తి ఓ ఆదివారం కొత్త టీ.వీ. మోజులో సకుటుంబ సపరివారంగా ఓ ప్రోగ్రాం తిలకిస్తూ కూర్చున్నాడు. ఆ రోజు మదర్స్‌డే సందర్భంగా నిర్వహించిన అభిప్రాయసేకరణలో ఓ మహిళామణి "పిల్లలు ప్రేమని అమ్మకే అందించాలి. నాన్నంటే కేవలం గౌరవం లేదా భయం కనబరుస్తారు...ఎందుకంటే అమ్మ వాస్తవం, నాన్న నమ్మకం కాబట్టి" అని చెప్పగానే "నో..నో..నో.." గొంతులోని నరాలు అన్నీ చిట్లి పొయ్యేలా అరిచాడు కృష్ణమూర్తి.

అవును మరి! అమ్మంటే వాస్తవంట. నాన్నంటే నమ్మకంట! ఎవరో ఎప్పుడో కాకతాళీయంగా అన్న మాటని నిజం చేస్తూ నాన్నంటే భ్రమ అని పిల్లలకి నూరిపోయడం ఎంతటి అన్యాయం అంటూ ఆక్రోశించాడు కృష్ణమూర్తి. కన్నతల్లి ఋణం తీర్చుకోలేనిది తనని కన్నది కూడా ఓ తల్లే. ఎవరూ కాదనలేరు కానీ తండ్రి మాటేమిటి?

నాన్నలు లేకుండానే పిల్లలు పుడతారా! నవమాసాలు మోసేదితల్లే. అయినంత మాత్రాన తండ్రి నామమాత్రానికేనా? మలమూత్రాలు శుభ్రంచేసేది తల్లే. అయితే మాత్రం తండ్రికి ప్రేమపొందే అర్హత లేనట్లేనా! ఎవరో రచయిత చెప్పినట్లు తండ్రి పిల్లలపట్ల ఎప్పుడు చిన్నప్పుడు బూచాడిలా, పెద్దయ్యాక కరెన్సీ కట్టలు అందించే యంత్రంలా మనవలసిందేనా? అంతర్మథనానికి లోనయ్యాడు కృష్ణమూర్తి.

బాండీలో వేయించి తయారుచేసి అమ్మ అందించే తినుబండారాల రుచికి మురిసిపోయే చిన్నారులకు కళ్లముందు అమ్మపడే కష్టం కన్పిస్తుంది.

గానీ ఆ బాండీలోకి కావలసిన పదార్థాలు కొనుక్కురావటానికి నాన్న ఎన్ని అవస్థలు పడ్డాడో, ఎంత కష్టపడి సంపాదించాడో ఆ పిల్లలకెట్లా తెలుస్తుంది.

కష్టం వస్తే అమ్మ వలవల ఏడ్చేస్తుంది. పిల్లలు ఓదారుస్తారు. మరి నాన్నో? మగాడుకదా...వాడికి కష్టం వస్తే తనివితీరా ఏడవటానిక్కూడా అవకాశం లేదు. ఎగతాళి చేస్తారు. ఎద్దేవా చేస్తారు. అందుకే ఏ కష్టమొచ్చినా తనలో తనే కుమిలిపోవాలి.

ఇదెక్కడి న్యాయం? అమ్మా నాన్న సమానం కాదా? అమ్మ తర్వాతేనా నాన్న? కేవలం డబ్బులు కాచేచెట్టేనా నాన్న? కరెన్సీ కట్టలు పుట్టించే యంత్రమేనా నాన్నా? అంతకుమించి ఏమీ కాడా? నాన్నంటే నమ్మకం! వాస్తవం కాదా! ఏమిటీ అన్యాయం?

బిడ్డపుట్టగానే కుప్పతొట్లో పడేసే అమ్మా అమ్మే!పిల్లల ఆలనాపాలనా పట్టకుండా తిరిగే అమ్మా అమ్మే! వాళ్లు వాస్తవమే! కానీ రెక్కలు ముక్కలు చేసుకుని, అవమానాలు, ఆపనిందలు భరించి, తన కష్టాన్ని తన కడుపులోనే దాచుకుని, పైకి గంభీరంగా కన్పించే ప్రయత్నంచేసే నాన్నలో ఎన్నెన్ని బాధలో, ఆ గుండెల్లో ఎన్నెన్ని బడబాగ్నులో కదా? అర్థంచేసుకోని భార్య, అర్థం చేసుకునే వయసురాని పిల్లల్తో అవస్థలుపడే తండ్రులు ఎంతమంది లేరు!

తండ్రికి పిల్లలంటే ప్రేమ వుండదా? పిల్లలు తండ్రిపట్ల ప్రేమ కనబరచాల్సిన పన్లేదా... కేవలం గౌరవిస్తేనో, భయం నటిస్తేనో సరిపోతుందా... తండ్రికి రెండో స్థానం... ఓకే అంతవరకూ అభ్యంతరంలేదు కానీ... కానీ తండ్రి వాస్తవంకాదనే మాట మాత్రం జీర్ణించుకోలేకపోయాడు కృష్ణమూర్తి.

'నాన్నా... నువ్వో సున్నానా?' అనుకుంటూ మవునంగా రోదించ సాగేడు కృష్ణమూర్తి...కాదుకాదు ఓనాన్న. డబ్బుల్లేని నాన్నల కథలు ఇలావుంటే డబ్బువున్న నాన్నల కథలు మరీ దుర్లభం. కేవలం డబ్బు కోసమే నాన్నని పలుకరించే పిల్లల్తో, డబ్బు మూలంగానైనా తనని పలుకరిస్తున్నందుకు సంతోషిస్తూ, ప్రాణం పోయేదాకా, ఆ సంతోషం కోసమే డబ్బుని ప్రాణంగా చూసుకొనే అవసరం పట్టనందుకు వూరట పొందాడు కృష్ణమూర్తి.

◆ **స్వాతి - జూలై, 2004** ◆